# గట్టి నిశ్చయం.

కాంతం నేనూ కూర్చుని లెక్కలు చూచుకొనేసరికి ఆ నెల అయిన కర్చు ఏ నెలా కాలేదని తేలింది. కారణం బంధువుల తాకిడి. కాంతం అన్నది "చూడండి మీరు ప్రతి వాడ్ని భోజనానికని యింటికి తీసుకొని రాకండి! కాస్త మంచి మాట మాట్లాడితేసరిఆయనమీకు పరమమిత్రుడౌతాడు. ఇక వాడికి అల్లుడిలాగ ఇంట్లో భోజనం, బయట కాఫీహోటలులో టిఫిన్! ఇదీ వరస. మీ కథలు బాగున్నాయని ఎవరైనా అనటం తరువాయి వాడి కాఫీ కర్చు అంతా ఆ పూటకు మీదన్నమాటే! ఇలా అయితే సంసారం గడవదు. తరువాయి మీయిష్టం. ఇక ఎవరినీ భోజనానికి పిలవకూడదని గట్టిగా నిశ్చయించుకోండి" అన్నది కాంతం నేను మేడమెట్లు ఎక్కుతుంటే.

ఇంతలో ఎవరో ఒక బ్రాహ్మణుడు మూట ఒకటి చంకను పెట్టుకొని "ఇదేనా కాంతమ్మగారి ఇల్లు" అని అడిగాడు మాయింటి ముందు నుంచుని. "ఈ యింట్లో వెంకట్రావుగారు అద్దెకున్నారు" అన్నాను నేను.

"కాంతమ్మగారెవరు? వారిక్కడ లేరా అన్నాడు" ఆయన ఆతురతో.

కాంతం నవ్వుకొంటూ "ఉందండి. ఇదే లెండి. నా పేరే కాంతమ్మ. ఎందుకండీ" అన్నది.

'అమ్మాయీ నువ్వేనా? చూడటంతోనే అనుకొన్నా. రత్నం చీకట్లో ఉంచినా మెరుస్తూనే ఉంటుంది.'

'తమరు ఎవరు? ఏప్రాంతం!'

"చెబుతాలే అమ్మా. రామారావుగారు చెప్పారు తమ సంగతి. మీరు సంపన్నగృహస్థులనీ, ఉదారవంతులనీ, నడి శ్రావణమాసంలో కొత్తనీటితో నిండి, బెక బెక అరుస్తూ ఉన్న, అనేకరకములైనటువంటి మండూకములచే నిండియున్న ఒక మాంచి తటాకంలాగ తమ గృహం ప్రకాశిస్తూ ఉంటుందని విని........"

మా ఆవిడ ముఖం చేటంత అయింది. సంతోషంతో తొణకసలాడుతూన్న ముఖంతో అల్లాగే నుంచుని చూస్తోంది.

"అమ్మాయీ, నేనేమో చెబుతున్నానని పొగుడుతున్నానని అనుకోకు. రామారావుగారి వల్ల మీ సంగతి అంతా విన్నాను. మీ అనుకూలదాంపత్యం, సిరి, సంపదా, మీ దైవభక్తి...అంతా బంగారానికి సువాసన అబ్బినరీతి... ఆ పరమేశ్వరుని అనుగ్రహం, అమ్మా" అన్నాను.

"బాబుగారూ, మీరు సరేవచ్చారు? బాగానేవుంది. తమకేంకావాలె! బీదవాళ్ళం మాతో మీలాంటి సద్బ్రాహ్మణులకు ఏంపనుందో నేనూహించలేకుండా ఉన్నాను" అన్నది ఈవిడ.

"అమ్మాయి, నీవు అల్లా గౌరవించటం నీయొక్క సుగుణములు ఇటువంటివని చెపుతున్నాయే కాని మరోటి కాదు. నమ్రత అనేది ఉన్నదే అమ్మా, అది ఎటువంటివారి

పైనా భూషణమే అవుతూవున్నది. ఒక పుష్పవనములో మాంచి గోముగా పెరిగినదై కమ్మనివాసనతో కూడిన పుష్ప ములూ తియ్యని ఫలములూ ఉండుటచేత, వంగినప్పటికైన దై యున్నా, వంగినా భారముచే కలిగిన విసుగునుగాక, కేవల మూన్నా, నమ్రతనే సూచిస్తూ, వివిధములైన పక్షిజాతులకు ఆశ్రయమిస్తూ, ఉన్న మామిడిగున్న ఏలాగంటి సౌశీల్యాన్ని వ్యక్తపరుస్తుందో, అల్లాంటిది మీ సౌశీల్యము" అన్నాడాయన.

ముసిముసి నవ్వులు నవ్వుకొంటూ "బాబూ పెద్దల ఆశీర్వాదము. అయితే నేను లోపలికెళ్ళాలి. తమరు వచ్చినపనేదో సెలవివ్వాలె."

"వచ్చే పమీ లేదండి- మిమ్ములను ఏమీ కోరటానికి గాని యాచనకుగాని రాలేదు. రామారావుగారి ద్వారా సంపన్న గృహస్థులు మీరు, ఆ మాటవిని మీదర్శనం చేసి వెళదాం అని వచ్చాను. అంతే కాని మరోటికాదు."

"బాబుగారూ మీరు మధ్యాహ్నం భోజనానంతరం రండి. శాస్త్ర పురాణ కాలక్షేపం చేద్దురుగాని. ఇప్పటికి సెలవ."

"ఒక్కమాట అమ్మాయీ. విన్నావా మాంచి సౌందర్యాది విలాసములతో ఒప్పుతున్నటువంటి వస్తువును చూశావా అంటే పంచభక్ష్య పరమాన్నాలతో భోజనంచేసినట్లు ఉంటుంది. ఇపుడు రామారావుగారి ఇల్లు చూడండి. భార్య జబ్బుమనిషి. పిల్లలులేరు. పైగా ఆ గదిలో ముసలిది, ఆయన తల్లి కాబోలు. తల్లిని 'మాతృదేవోభవ' అన్నారు. పూజించ వలసిందే కాని పిల్లజెల్ల లేని కొంపలో భోజనం అంటే అదే మిరపకాయ పచ్చడిలో కూడుతిన్నట్లుంటుంది. అవునా... ..

అమ్మాయీ అని సంగతి. ఇపుడు మీ గృహము చూడండి. ఎంత ఆహ్లాదకరంగా ఉందో. పేరుపొంది, కీర్తిని విస్తారం గడించినట్టి మాంచి చిత్రకారులచే చిత్రింపబడిన ఉత్తమమైన చిత్రములచే అలంకరింపబడిన దివ్య సౌధములాగ ఉంటికాదు మీఇల్లు."

'ఏముందండీ మా ఇంట్లో, ఇంటినిండా గుడ్డపేలికలూ, పేడబొమ్మలూ, దిశిమొలతో నున్న అపిల్లలూనూ'

'ఆ ఆ. దిశిమొలలే సజీవమైన చిత్రాలు. అక్కడే ఉంది, ఆ పిల్లల వలననే ఈ యిల్లు సజీవమైన చిత్రశాల అయింది'

"ఏదోలెండి పెద్దల ఆశీర్వచనము. అయితే బాబూ తమ దేవూరు?"

'మాది తెనాలిదగ్గర సింహపురం'

'తెనాలి తరుచూ వస్తుంటారా ?'

"ఆ తరచూ ఏమిటి, పోయినలేస్తె తెనాలి రాకతప్పదు. ఆకుకూ, కూరకూ, మందుకూ, మాకుకూనూ."

'మందెవరికి బాబూ ?'

"నాకు కాదమ్మా. మా ముసలి ఈ మధ్య మహాచెడ్డ జబ్బుపడ్డది. బ్రతుకుతుందనుకోలేదు. తెనాలిలో ఒక డాక్టరు గారున్నారమ్మా. చిన్నవాడే కాని ఏమి అనుభవం ! ఏమి ఓపికా ! ఆయనేదానికి ప్రాణదానంచేశాడు. గంపెడు సంసారం నాదీనీ ! అది తప్పితే ఇంట్లో గంగపోశే వాళ్లు లేరు ! ఆ మహానుభావుని దయవల్ల మళ్ళీ బ్రతికి బట్టగట్టింది. ఆయనకు చెయ్యెత్తి దణ్ణంపెట్టని రోజులేదు ! చల్లనివేళ జ్ఞాపకం వచ్చాడమ్మా ! శ్రీరామమూర్తిగారు !"

"మా తమ్ముడే!...మా తమ్ముడేనండి ఆయన!" అన్నది. మా ఆవిడ పొంగిపోతున్న సంతోషాన్ని ఆపుకో లేకుండా.

ఆయనకూడా వెనక్కు విరుచుకొనిపడి నోరు తెరిచి ఒక్క అరనిమిషం అల్లాగఉండి "అల్లాగ అమ్మా" అని అన్నాడు, తెప్పరిల్లి. 'మాతమ్ముడే' అన్నది మళ్లీ ఈవిడ.

"చిత్రం. ఇహ ఎందుకూ! తెలిసింది! గులాబీమొక్క ఎక్కడవున్నా ఒకే మోస్తరు పూలు పూస్తుంది. ఒకేరకం సువాసన! నా తల్లీ...ఎంత సుదినం ఇవ్వాళ! ........."

'అమ్మాయీ, నీవూ ఆయనా ఒక్కతల్లిబిడ్డలేకాదూ?'

'ఆ. ఒక్కతల్లి బిడ్డలం' అని అంది కాంతం గర్వంగా.

'ఆహా! ఆ తల్లి సుకృతం. యీలాంటి సంతానాన్ని కనటం. మీ అమ్మ కడుపు చలవదనమమ్మా ఇదంతా. ఆమె నిజంగా మహాపుణ్యాత్మురాలు.'

'కాబట్టే, పాతికేళ్ళకే పరలోకానికి—' అన్నది.

"అల్లాగ అమ్మా పాపం.........ఇప్పుడు ఉండి మీ తమ్ముడిగార్ని సర్వజనులూ మెచ్చుకొంటూ వుండడం, సర్వ వృద్ధులూ ఉండటం, ప్రతినాడూ కృతజ్ఞతతో బీదలపాలిట దేవుడని,ఆయనకు నమస్కారంచేస్తూ ఉండటం, ఆవిడ వుండి చూస్తె ఆ మాతృ హృదయం ఎంత సంతోషించేదో! నీ సంసారం—నీ ఆనందం కూడా చూడకుండా పోయింది కాబోలు ఆ తల్లి!" అన్నాడు ఆ బ్రాహ్మణుడు.

'ఆ' అన్నది కాంతం చెమ్మగిల్లిన నేత్రాలతో.

అప్పటికే తొమ్మిదైంది. ఆయన ఆప్తబంధువులాగ, పిల్లల అందరి పేర్లూ అడిగి తెలుసుకొని, అందరినీ దీవించి "ఇక వెడతానమ్మా" అన్నాడు.

'మీరు ఈ పూట ఇక్కడే దేవతార్చన చేయాలండీ' అన్నది కాంతం.

'ఎందుకులే అమ్మా. రామారావుగారు ఏమైనా అనుకొంటారు.'

"ఏమనుకోరు లెండి. మీరు తప్పక ఇక్కడే ఉండి పోవాలె. మనమంతా గుంటూరుజిల్లా వాళ్లము. అందులో మీరు సత్పురుషులున్నూ, చదువుకొన్న వారున్నూ, పెద్దలూ. తప్పక ఇక్కడే దేవతార్చన తప్పదు."

"అమ్మాయీ, నీవు బంధువులకంటే ఎక్కువగా కుమార్తెవలె ఆదరిస్తున్నావు. నీ మనస్సుకు కష్టం కలుగ చెయ్యటం ఎందుకూ. సరే - కాలవ ఎటువైపమ్మా? మూట ఇక్కడ పెట్టుకోనా ?"

'ఈ రోడ్డే వెళ్లండి, కాలువ కనుపిస్తుంది. సంధ్యావందనం కాలవలో చాలసేపు చేయకండేం. వారు మళ్ళీ కచ్చేరికి వెళ్ళాలె.'

'ఎంతోసేపా, రెండు బుటకలువేసి రెండు నిమిట్లో రానూ!'

కాంతం పరుగెత్తుకుంటూ పైకొచ్చి, 'చూడండి, సద్బ్రాహ్మణుడు, చదువుకొన్నవాడూ, వేదం అవీ చదువుకొన్నాడనుకొంటా, మనవేపు వాడే, మనవాడినీ, మా చెల్లెళ్లనూ అందరినీ ఎరుగునట !'

'అయితే...'

'ఆయన మన ఇంటికి వస్తే, దేవతార్చన ఇక్కడే చేసుకోవాల్సింది' అన్నాను.

'ఎవరో టోపి వేశాడు!'

'చాల్లే, ఊరుకోండి, కళ్ళు పోతాయి. మంచి బ్రాహ్మణ్ణి ఏమైనా అనేరు. పిల్లలుగలవాళ్ళం మనం...'

'సరే నే నిప్పుడు చేయాల్సిం దేమిటి ?'

"కొంచెం బజారు కెళ్ళి...శనివార మేగా— కూరలూ, అవీ, తమలపాకులు, వక్కలు ఇంట్లో ఉన్నాయి లెండి. చూడండి ఒక్క పరక నాజూకు పసందు......ఆ...విన్నారా ?......కాస్త మంచిరకం తీసుకు రండి ... ... ... ... ... ...చూడండి......మిమ్మల్నే...ఒక్క మాట దారిలో పోమాయితో, ఒక శేరు పాలు కావాలని చెప్పండి!"

"కూరలు తేవటానికి డబ్బులేదే!"

"ఎక్కడైనా అప్పుజేసి అయినా సరే......తప్పదు."

"ఇందాక మనం అనుకొన్న మాట ఏమిటి ? నీవు ఇల్లాగా......"

"ఆ నెక్కడ మాట్లాడు కుందాంలెండి. నాకు వంటింట్లో పనుంది. మీరు వెంటనే బజారు కెళ్ళండి నా మాటవిని. ఏ స్నేహితుడితోనో మాట్లాడుతూ కూర్చోకండి. వేగిరం రావాలె. చూడండీ, పసిదాన్ని చంక నేసుకొని పోరాదూ బజారు కేగా! నేను ఇంట్లో పని వేగిరం చేసుకోవాలె."

ఈ మాట వినేసరికి వళ్ళు మండిపోయింది. ఉత్తరీయం ఝాడించి పైన వేసికొని తిరిగి చూడకుండా గుమ్మం దాటాను.